रीजिस्ट्री सं डी — २२१
Registered No. D - 221
రిజిస్ట్రీ సంఖ్య డి - 221

मूल्य रु 5.00 पैसे
[Price Rs. 5.00 Paise.
మూల్యము : రూ. 5.00 పైసలు.

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
**EXTRAORDINARY**
అసాధారణ

भाग XVI अनुभाग 1
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | |
|---|---|---|---|---|
| सं. १<br>No. 1<br>సంఖ్య 1 | नई दिल्ली<br>New Delhi<br>న్యూఢిల్లీ | सोमवार<br>Monday<br>సోమవారము | ६ मार्च, १९९५ / १५ फालगुन, १९१६ शक<br>6th March, 1995 / 15th Phalgun, 1916 Saka<br>6 మార్చి, 1995 / 15 ఫాల్గుణ, 1916 శక | खंड १०<br>Vol. 10<br>సంపుటము. 10 |

## MINISTRY OF LAW AND JUSTICE
## (LEGISLATIVE DEPARTMENT)

*New Delhi, 21st February, 1995 / 2nd Phalgun, 1916 Saka*

The Translations in Telugu of the following, namely :–

(1) The Trade Union Act, 1926 (Act 16 of 1926); (2) The workmen's compensation Act, 1923 (Act 8 of 1923); (3) The weekly Holidays Act, 1942 (Act 18 of 1942); (4) The Indecent Representation of women (Prohibition) Act, 1986 (Act 60 of 1986); (5) The Medical Termination of Pregnency Act, 1971 (Act 34 of 1971); (6) The Dowry Prohibition Act, 1961 (Act 28 of 1961) and (7) The Muslim Women (Protection of Rights on Divorce) Act, 1986 (Act 25 of 1986) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Texts thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

**శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వశాఖ**

**(శాసన నిర్మాణ విభాగము)**

*న్యూఢిల్లీ, 21 ఫిబ్రవరి, 1995 / 2 ఫాల్గుణ, 1916 శక*

ఈ క్రింది చట్టములు: అనగా:--

(1) ది ట్రేడ్ యూనియన్ యాక్టు, 1926 (1926లోని 16వ చట్టము); (2) ది వర్క్‌మెన్ కాంపెన్సేషన్ యాక్టు, 1923 (1923లోని 8వ చట్టము); (3) ది వీక్లీ హాలిడేస్ యాక్టు, 1942 (1942లోని 18వ చట్టము); (4) ది ఇండీసెంట్ రిప్రెజెంటేషన్ ఆఫ్ ఉమెన్ (ప్రొహిబిషన్) యాక్టు, 1986 (1986లోని 60వ చట్టము); (5) ది మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్టు, 1971 (1971లోని 34వ చట్టము); (6) ది డౌరీ ప్రొహిబిషన్ యాక్టు, 1961 (1961లోని 28వ చట్టము) మరియు (7) ది ముస్లిం ఉమెన్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ డైవర్స్) యాక్టు, 1986 (1986లోని 25వ చట్టము) ల యొక్క తెలుగు అనువాదములను రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఈ అనువాదములను ఆ చట్టములకు, ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# స్త్రీల అసభ్య చిత్రణ (నిషేధ) చట్టము, 1986

## (1986 లోని 60వ చట్టము)

(23 డిసెంబరు, 1986)

**ప్రకటనల ద్వారా గాని, లేక ప్రచురణలలో, వ్రాతలలో, వర్ణ చిత్రాలలో, ఆకృతులలో లేక ఏదేని ఇతర రీతిలోగాని స్త్రీలను అసభ్యముగా చిత్రించుటను నిషేధించుటకును దానికి సంబంధించిన లేక అందుకు ఆనుషంగికమైన విషయముల కొరకును అయిన చట్టము.**

భారత గణరాజ్యము యొక్క ముప్పది ఏడవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయడమైనది:-

సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము.

1. (1) ఈ చట్టమును స్త్రీల అసభ్య చిత్రణ (నిషేధ) చట్టము, 1986 అని పేర్కొనవచ్చును.

(2) ఇది జమ్మూ, కాశ్మీరు రాజ్యము మినహా యావద్భారత దేశమునకు విస్తరించును.

(3) ఇది, కేంద్ర ప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీన అమలులోనికివచ్చును.

నిర్వచనములు.

2. ఈ చట్టములో, సందర్భమునుబట్టి అర్థము వేరుగా ఉన్ననే తప్ప,--

(ఎ) "ప్రకటన" అను పదపరిధిలో ఏదేని నోటీసు, సర్క్యులరు, లేబులు, రేపరు లేక ఇతర దస్తావేజు చేరియుండును. మరియు ఇందులో ఏదేని కాంతి, ధ్వని, పొగ లేక గ్యాస్ ద్వారా చేయబడిన ఏదేని దృశ్య రూప చిత్రము కూడ చేరియుండును.

(బి) "పంపిణీ" అను పదపరిధిలో ఉచితముగా గాని లేక అన్యథా గాని నమూనాల ద్వారా పంపిణీ చేయుట చేరియుండును.

(సి) "స్త్రీల అసభ్య చిత్రణ" అనగా ఏ రీతిగానైనను ఒక స్త్రీ యొక్క ఆకృతిని, ఆమె రూపమును, లేక శరీరమును లేక శరీరమునందలి ఏదేని భాగమును, అసభ్యకరమైన ప్రభావము కలిగియుండునట్లు, స్త్రీలకు గౌరవ భంగము కలిగించునట్లు లేక అవమానకరముగా నుండునట్లు లేక ప్రజల నైతికతకు, నైతిక ప్రవర్తనకు బహుశః భంగకరముగను, అవినీతికరముగను, హానికరముగను ఉండునట్లు చిత్రించుట అని అర్థము;

(డి) "లేబుల్" అనగా ఏదేని ప్యాకేజికి అతికించబడిన లేక దానిపై కనిపించునట్లు ఏదేని వ్రాయబడిన, గుర్తు వేయబడిన స్టాంపు వేయబడిన, ముద్రించబడిన, గ్రాఫ్ చేయబడిన విషయము;

(ఇ) "ప్యాకేజీ" అను పదపరిధిలో పెట్టె, అట్టపెట్టె (కార్టన్) రేకు డబ్బా (టిన్ను) లేక ఇతర పాత్ర చేరియుండును;

(యఫ్) "విహిత" అనగా, ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచిన అని అర్థము.

*స్త్రీల అసభ్య చిత్రణ కలిగి యున్న ప్రకటన నిషేధము.*

3. ఏ వ్యక్తియు, ఏ రూపములోనైనను స్త్రీల అసభ్య చిత్రణమును కలిగి యున్న ఏదేని ప్రకటనను ప్రచురించరాదు, ప్రచురించినట్లు చేయరాదు. దానిని ప్రచురించుటకు లేక ప్రదర్శించుటకు ఏర్పాటు చేయరాదు. లేక దానిలో పాల్గొనరాదు.

*స్త్రీల అసభ్య చిత్రణలు కలిగి యున్న పుస్తకములు, కరపత్రములు మొదలైన వాటి ప్రచురణను లేక వాటిని తపాల ద్వారా పంపుటను నిషేధించుట.*

4. ఏ వ్యక్తియు ఏ రూపములోనైనను స్త్రీల అసభ్య చిత్రణలు కలిగియున్న ఏదేని పుస్తకమును, కరపత్రమును, పత్రికను, స్లైడ్‌ను, ఫిల్మ్‌ను, వ్రాతను, రేఖాచిత్రమును, వర్ణచిత్రమును, ఫోటోను, చిత్రణమును, లేక ఆకృతిని తయారు చేయరాదు లేక తయారుచేయునట్లు చేయరాదు. విక్రయించరాదు, కిరాయకు ఈయరాదు, పంచిపెట్టరాదు, సర్క్యులేటు చేయరాదు, లేక తపాల ద్వారా పంపరాదు.

అయితే ఈ చట్టములో నున్నదేదియు ఈ క్రింది వాటికి వర్తించదు.

(ఎ) (i) దేనిని ప్రచురించుట వలన విజ్ఞాన శాస్త్రము, సాహిత్యము, కళ, విద్వత్తు యొక్క లేక ప్రజానీకమునకు సంబంధించిన ఇతర విషయముల యొక్క హితము పెంపొందింపబడునను ఆధారముపై ప్రజాశ్రేయస్సు దృష్ట్యా అట్టి ప్రచురణ సమర్థవంతమైనదని రుజువుపరచబడునో అట్టి ఏదేని పుస్తకము, కరపత్రము, పత్రిక, స్లయిడ్, ఫిల్మ, వ్రాత, రేఖాచిత్రము, వర్ణచిత్రము, ఫోటో చిత్రణము లేక ఆకృతి, లేక

(ii) ఏది మత ప్రయోజనముల కొరకై సద్భావపూర్వకముగా భద్రపరచబడునో లేక ఉపయోగించబడునో,

అట్టి ఏదేని పుస్తకము, కరపత్రము, పత్రిక, స్లయిడ్, ఫిల్మ వ్రాత, రేఖాచిత్రము, వర్ణచిత్రము, ఫోటో చిత్రణము లేక ఆకృతి;

*1958 లోని 24.*

(బి) (i) ప్రాచీన స్మారక చిహ్నముల మరియు పురాతత్వ స్థలముల, అవశేషముల చట్టము, 1958 యొక్క భావపరిధిలోని ఏదేని ప్రాచీన స్మారక చిహ్నముపైగాని, దానిలోగాని, లేక

(ii) ఏదేని దేవాలయముపైగాని దానిలోగాని లేక విగ్రహముల ఊరేగింపుకొరకై ఉపయోగింపబడు లేదా ఏదేని మత ప్రయోజనము కొరకై భద్రపరచబడు మరియు ఉపయోగించబడు ఏదేని రథముపైగాని, దానిలో గాని

శిల్పముగా మలచబడిన, చెక్కబడిన, రంగువేయబడిన, లేక అన్యథా రూపొందించబడిన ఏదేని చిత్రణము.

*1952 లోని 37.*

(సి) చలనచిత్ర చట్టము, 1952 యొక్క భాగము II లోని నిబంధనలు వర్తించునట్టి ఏదేని ఫిల్మ.

*ప్రవేశించి సోదా చేయుటకు అధికారము.*

5. (1) విహితపరచినట్టి నియమములకు లోబడి రాజ్య ప్రభుత్వముచే ప్రాధికారము పొందినట్టి ఎవరేని గజిటెడ్ అధికారి, అట్లు ప్రాధికారము పొందినట్టి ప్రాంతపు స్థానిక హద్దుల లోపల అతడు—

(ఎ) యుక్తమైన అన్ని వేళలందు తాను ఆవశ్యకమని భావించునట్టి సహాయము ఏదేని ఉన్నచో, ఆ సహాయముతో ఈ చట్టము క్రింద అపరాధము జరిగినదని, లేక జరుగుచున్నదని విశ్వసించుటకు తనకు కారణమున్న ఏదేని స్థలములో ప్రవేశించి సోదా చేయవచ్చును.

(బి) ఈ చట్టము యొక్క ఏవేని నిబంధనలను ఉల్లంఘించుచున్నదని విశ్వసించుటకు తనకు కారణమున్న ఏదేని ప్రకటనను లేక ఏదేని పుస్తకమును కరపత్రమును, పత్రికను, స్లైడ్‌ను, ఫిల్మును, వ్రాతను, రేఖాచిత్రమును, వర్ణ చిత్రమును, ఫోటో చిత్రణమును లేక ఆకృతిని అభిగ్రహించవచ్చును.

(సి) ఖండము (ఎ)లో పేర్కొనిన ఏదేని స్థలములో దొరికిన ఏదేని రికార్డును, రిజిస్టరును, దస్తావేజును లేక ఏదేని ఇతర భౌతిక వస్తువును పరీక్షించి, ఈ చట్టము క్రింద శిక్షించదగిన అపరాధము జరిగినదనుటకు సాక్ష్యమును ఈయగలదని విశ్వసించుటకు తనకు కారణమున్నచో, దానిని అభిగ్రహించవచ్చును. అయితే ఈ ఉపపరిచ్ఛేదము క్రింద వారెంటు లేకుండ ఒక ప్రైవేటు నివాస గృహములో ప్రవేశించరాదు:

అంతేకాక, అట్టి ప్రకటన కలిగియున్న ఏదేని దస్తావేజు, పరికరము లేక వస్తువు విషయములో దానిపై ఉబ్బెత్తుగా అచ్చువేసిన కారణముగా గాని అన్యథా గాని, అట్టి దస్తావేజు, పరికరము లేక వస్తువు నుండి, దాని సమగ్రతను, వాడుకను, లేక దాని విక్రయపు విలువకు భంగము కలిగించకుండా ఆ ప్రకటనను వేరుపరచలేనప్పుడు అట్టి దస్తావేజు, పరికరము లేక వస్తువునందలి అంశములు ఏవేని ఉన్నచో, వాటితో సహా దానిని అభిగ్రహించు అధికారము ఈ ఉపపరిచ్ఛేదము క్రింద వినియోగించవచ్చును.

(2) క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 యొక్క నిబంధనలు వీలైనంత మేరకు సదరు స్మృతి యొక్క 94వ పరిచ్ఛేదపు ప్రాధికారము క్రింద జారీచేసిన వారెంటు క్రింద చేయబడిన ఏదేని సోదా, లేక అభిగ్రహణకు వర్తించునట్లే ఈ చట్టము క్రింద చేయబడిన ఏదేని సోదాకు లేక అభిగ్రహణకు వర్తించవలెను.

(3) ఎవరేని వ్యక్తి ఉపపరిచ్ఛేదము (1) యొక్క ఖండము (బి) లేక ఖండము (సి) క్రింద దేనిసైనను అభిగ్రహించినయెడల, అతడు, వీలైనంత త్వరగా అత్యంత సమీపములోనున్న మేజిస్ట్రేటుకు తెలియజేసి దాని అభిరక్షకొరకు అతని ఉత్తరువులను పొందవలెను.

6. 3వ పరిచ్ఛేదము మరియు 4వ పరిచ్ఛేదము యొక్క నిబంధనలను ఉల్లంఘించినట్టి ఎవరేని వ్యక్తి, మొదటి దోషస్థాపనపై రెండు సంవత్సరముల దాకా ఉండగల కాలావధికి రెంటిలో ఒక రకపు కారావాసముతోను, రెండువేల రూపాయల దాకా ఉండగల జుర్మానాతోను, రెండవ లేక ఆ తరువాతి దోషస్థాపన జరిగిన సందర్భములో, ఆరు మాసములకు తక్కువకాని అయితే అయిదు సంవత్సరములదాక ఉండగల కారావాసముతోను మరియు పదివేల రూపాయలకు తక్కువకాని అయితే ఒక లక్ష రూపాయలదాకా ఉండగల జుర్మానాతోను శిక్షింపదగియుండును. శాస్తి.

7. (1) ఈ చట్టము క్రింద ఒక కంపెనీచే అపరాధము చేయబడినయెడల ఆ అపరాధము జరిగినప్పుడు, ఆ కంపెనీ యొక్క వ్యాపార నిర్వహణ భారమువహించి దానికొరకై కంపెనీకి జవాబుదారీయైయున్న ప్రతి వ్యక్తియు మరియు ఆ కంపెనీయు ఆ అపరాధమును చేసినట్లు భావించవలెను. మరియు తదనుసారముగ చర్యలు జరుపబడి, శిక్షింపబడుటకు లోనైయుండును: కంపెనీలచే అపరాధములు.

అయితే, అట్టి ఎవరేని వ్యక్తి తనకు తెలియకుండ అపరాధము జరిగినదని గాని అట్టి అపరాధ నివారణకై తగు జాగ్రత్తనంతయు తీసుకొనినట్లు గాని రుజువు చేసినచో ఈ ఉపపరిచ్ఛేదములో నున్నదేదియు అతనిని ఎట్టి శిక్షకు పాత్రునిచేయదు.

(2) ఉపపరిచ్ఛేదము (1)లో ఏమియున్నప్పటికినీ, ఈ చట్టము క్రింది ఏదేని అపరాధము ఒక కంపెనీ చేసియుండి, ఆ అపరాధము కంపెనీయొక్క ఎవరేని డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారి సమ్మతితో లేక మౌనానుకూలతతో జరిగినదని లేక అతనిపట్ల ఏదేని నిర్లక్ష్యము ఆపాదించదగినదని రుజువైన యెడల, ఆ డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారిపై చర్యలు జరుపబడి తదనుసారముగ శిక్షింపబడదగియుండును.

విశదీకరణ:— ఈ పరిచ్ఛేదము నిమిత్తము,—

(ఎ) "కంపెనీ" అనగా ఏదేని నిగమ నికాయము అని అర్థము, ఈ పద పరిధిలో ఫర్మ లేక వ్యక్తుల ఇతర అసోసియేషను చేరియుండును; మరియు

(బి) ఫర్మకు సంబంధించిన "డైరెక్టరు" అనగా ఫర్మలోని భాగస్వామి అని అర్థము.

అపరాధములు సంజ్ఞేయమై, జామీనుయోగ్యమై యుండుట.

8. (1) క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973లో ఏమియున్నప్పటికినీ, ఈ చట్టము క్రింద శిక్షింపదగిన అపరాధము జామీను యోగ్యమైయుండును.

(2) ఈ చట్టము క్రింద శిక్షింపదగిన అపరాధము సంజ్ఞేయమై యుండను.

సద్భావముతో తీసికొనబడిన చర్యకు రక్షణ.

9. ఈ చట్టము క్రింద సద్భావముతో చేసిన, లేక చేయుటకు ఉద్దేశించిన దేనికైనను, కేంద్ర ప్రభుత్వముపైగాని రాజ్యప్రభుత్వముపైగాని కేంద్ర ప్రభుత్వము యొక్క లేక రాజ్య ప్రభుత్వము యొక్క ఎవరేని అధికారిపైగాని దావా, అభియోగము లేక ఇతర శాసనిక చర్య ఏదియు ఉండదు.

నియమములు చేయుటకు అధికారము.

10. (1) కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టపు నిబంధనలను నెరవేర్చుటకు రాజపత్రములో అధిసూచన ద్వారా నియమములు చేయవచ్చును.

(2) ప్రత్యేకించి, మరియు పైన తెల్పిన అధికారము యొక్క వ్యాపకతకు భంగము వాటిల్లకుండ అట్టి నియమములలో ఈ క్రింది విషయములన్నింటికి కొరకైనను, లేక వాటిలో వేటి కొరకైనను నిబంధనలు చేయవచ్చును; అవేవనగా:—

(ఎ) ప్రకటనలను లేక ఇతర వస్తువులను అభిగ్రహించవలసిన రీతి, అభిగ్రహించబడిన వాటి జాబితాను తయారుచేయవలసిన రీతి మరియు ఏదేని ప్రకటన లేక ఇతర వస్తువు ఎవరి నుండి అభిగ్రహించబడినదో ఆ వ్యక్తికి దానిని అందజేయవలసిన రీతి;

(బి) విహితపరచవలసిన లేక విహితపరచదగు ఏదేని ఇతర విషయము;

(3) ఈ చట్టము క్రింద చేయబడిన ప్రతి నియమమును, అది చేయబడిన పిమ్మట వీలైనంత శీఘ్రముగా పార్లమెంటు అధివేశనములో ఉన్నప్పుడు మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను. ఆ ముప్పది దినములు, ఒకే అధివేశనములోగాని, రెండు లేక అంతకు ఎక్కువ వెనువెంటనే వచ్చు అధివేశనములలోగాని చేరియుండవచ్చును. మరియు పైన చెప్పబడిన అధివేశనముగాని, లేక వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనముగాని ముగియుటకు పూర్వమే ఆ నియమములో ఏదేని మార్పుచేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ నియమము చేయబడరాదని ఉభయ సదనములు అంగీకరించినచో అటుపిమ్మట ఆ నియమము అట్లు మార్పుచేయబడిన రూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును. లేక సందర్భానుసారముగా ప్రభావరహితమై యుండును. అయినప్పటికినీ ఆ నియమమునందలి ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని, అంతకుపూర్వము ఆ నియమము క్రింద చేయబడిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.